నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
10 కరీంనగర్, శుక్రవారం 25 అక్టోబర్ 2024 RAJANNA SIRCILLA

## పత్తి రైతుకు దక్కని 'మద్దతు'



జమ్మికుంట, అక్టోబర్ 24 : బహిరంగ మార్కెట్‌లో దూదికి డిమాండ్ ఉన్నప్పటికీ పత్తి రైతుకు నిరాశే మిగులుతున్నది. ప్రభుత్వ కనీస మద్దతు ధర ₹7521 దక్కడం లేదు. క్వింటాల్‌కు ₹7 వేలకు మించి రావడం లేదు. వరంగల్ మార్కెట్‌లో ₹7వేలకు పైగా ధర పలుకుతుంటే, జమ్మికుంటలో ₹6800 దాటడం లేదు. గురువారం పత్తి మార్కెట్‌కు 1678 క్వింటాళ్లు రాగా, గరిష్ఠ ధర ₹6750 పలికింది. ఇది కొద్ది మంది రైతులకే దక్కింది. ఆ తర్వాత ₹6500, ₹6వేల వరకే వచ్చింది. ఇక ఇటీవల రంగంలో దిగిన సీసీఐ తేమ సాకుతో పత్తి సేకరణలో వెనుకడుగు వేస్తున్నది. దీంతో వ్యాపారులు 'ఆడిందే ఆట.. పాడిందే పాట'లా మారింది. కొనుగోళ్లు ఇష్టారాజ్యంగా సాగడమే కాదు, వ్యాపారులు తూకంలో చేతివాటం చూపిస్తున్నారని, వాహనానికి 20 నుంచి 40కిలోల తేడాలతో దోపిడీ చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. మద్దతు ధరలు, తూకాల్లో తేడాలతో వేలల్లో నష్టపోతున్నామని వాపోతున్నారు.



కరీంనగర్: గంగుల కమలాకర్ తల్లి లక్ష్మీనర్సమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# కొనుగోళ్లపై కొర్రీలు



చందుర్తిలో దళారులకు ధాన్యం తూకం వేస్తున్న కూలీలు

- ఎన్నడూ లేని విధంగా సర్కారు నిబంధనలు
- ఏఈవోలు నిర్ధారిస్తేనే ధాన్యం కొనుగోళ్లు!
- ముందుగాల్నే ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు
- కౌలు రైతులకు మరీ గడ్డు పరిస్థితి
- పట్టాదారు ఓటీపీ చెబితేనే కొనుగోళ్లు
- సన్నవడ్ల నిర్ధారణ కూడా కష్టమే
- ఈ బాధ్యతలు కూడా ఏఈవోలకే
- నమ్మకం కోల్పోతున్న రైతాంగం

ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం కొర్రీల మీద కొర్రీలు పెడుతున్నది. గతంలో ఎన్నడూ లేనివిధంగా నిబంధనలతో ఆగం చేస్తున్నది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే ఇవి తప్పనిసరి పాటించాలని, అలాగే తేమ శాతం, ఎఫ్‌ఏక్యూ నిబంధనల ప్రకారం ధాన్యం ఉన్నదని ఏఈవోలు నిర్ధారించిన తర్వాతనే కొనుగోళ్లు చేస్తారని మెలిక పెట్టింది. అంతే కాకుండా, సన్నరకాలను కూడా నిర్ధారణ తర్వతే కొనాలని అధికారులను ఆదేశించింది. ఈ పరిస్థితుల్లో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నది. కొనుగోలు కేంద్రాలపై నమ్మకం కోల్పోయి, అగ్గువసగ్గువకే వడ్లను తెగనమ్ముకుంటున్నది.

కరీంనగర్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : రైతులు ఆరుగాలం పండించిన పంట ఉత్పత్తులను విక్రయించుకునేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో సులభమైన పద్ధతులను అనుసరించింది. ఏ ఊరికి సంబంధించిన ధాన్యాన్ని ఆ ఊరిలోనే కొనేలా కేంద్రాలను ఏర్పాటు చేసింది. అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలూ జరగకుండా చూసింది. చివరి రైతు వరకు కొనుగోళ్లు జరిపి ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూసింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తున్నది. కొనుగోళ్లను తగ్గించే ప్రయత్నం చేస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో కేంద్రాల నిర్వాహకులే తేమ, తదితర నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి కొనుగోళ్లు జరిపేవారు. ఇప్పుడు వ్యవసాయ విస్తరణ అధికారులు ధ్రువీకరించిన తర్వాతనే కొనుగోళ్లు జరపాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఇది ఎంత వరకు సాధ్యమవుతుందనే చర్చ జరుగుతున్నది. ఒక్కో మండలంలో నలుగురైదుగురు మాత్రమే ఏఈవోలు ఉంటారు. ఎంత చిన్న మండలంలోనైనా కనీసం 7 నుంచి 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుంది. ఇలాంటి సమయంలో ప్రతి రైతు ధాన్యాన్ని ఏఈవోలు నిర్ధారించే పరిస్థితి ఉంటుందా..? అనే చర్చ జరుగుతున్నది.

### నిబంధనల్లో ఏమున్నది?

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. ఆయా గ్రామాల్లోని కేంద్రాలకు రైతులు ధాన్యం తేగానే నిర్వాహకులు రైతు పేరు, కేంద్రానికి తెచ్చిన ధాన్యం వివరాలు నమోదు చేసుకుని ఏఈవోలకు సమాచారం అందిస్తారు. వారు తమకు వీలైనప్పుడు వచ్చి పరిశీలిస్తారు. ఎఫ్‌ఏక్యూ నిబంధనల ప్రకారంగా 17 శాతం మాత్రమే తేమ, ఇతర ప్రమాణాలు ఉంటేనే ఏఈవోలు ధ్రువీకరిస్తారు. ఒక వేళ తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉంటే వారు ధ్రువీకరించే పరిస్థితి ఉండదు. రైతులు తమ వెంట ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్ పాసు పుస్తకం తీసుకెళ్లాల్సి ఉంటుంది. ముందుగా వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. కౌలు రైతుల పరిస్థితి మరోలా ఉంది. పట్టాదారుల మాదిరిగానే కౌలు రైతులు కూడా అన్ని రకాల పత్రాలు వెంట తీసుకెళ్లాలి. అయితే, ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పుడు ఓటీపీ మాత్రం పట్టాదారుకు వెళ్తుంది. పట్టాదారు ఈ ఓటీపీ నంబర్ చెబితేనే ఆన్‌లైన్‌లో నమోదై కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే పరిస్థితి ఉంటుంది.

### సన్నవడ్లనూ నిర్ధారించాలి

సన్నరకం ధాన్యాన్ని నిర్ధారించే బాధ్యతలను కూడా ప్రభుత్వం ఏఈవోలకు అప్పగించింది. సన్నవడ్లకు ₹500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో వీటిని ఎక్కువగా సాగు చేశారు. ఈ వివరాలను వ్యవసాయ అధికారులు ఇది వరకే నమోదు చేశారు. అయితే, సన్నవడ్లు ఏ రకమైనా కేంద్రాల్లో కొనుగోలు చేస్తారని ఇన్నాళ్లు రైతులు ఆశలు పెంచుకున్నారు. కానీ, వీటికి కూడా ప్రభుత్వం నిబంధనల పేరిట ఆంక్షలు పెట్టింది. కేవలం 33 రకాల సన్న రకాలను మాత్రమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తామని స్పష్టం చేసింది. ఇతర రకాలు తేవద్దని కూడా తేల్చి చెప్పడంతో కొందరు రైతులు అయోమయంలో పడ్డారు. దొడ్డురకం, సన్నరకం ధాన్యానికి కేంద్రాల్లో వేర్వేరుగా కొనుగోలు చేసే ఏర్పాట్లు చేస్తున్నారు. సన్నరకం కొద్ది రోజులు ఆలస్యంగా కేంద్రాలకు వచ్చే అవకాశమున్నది. 33 రకాల్లో ఏ రకమో నిర్ధారించడం, అసలు అవి సన్నాలా..? కావా..? అనేది నిర్ధారించే బాధ్యతలను కూడా ప్రభుత్వం ఏఈవోలకు అప్పగించింది. 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ ఉండకూడదని, వెడల్పు 2 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ ఉండకూడదనే నిబంధన పెట్టింది. అందుకు అవసరమైన మైక్రో మీటర్లను కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం పెడుతున్న కొర్రీలతో రైతులకు తిప్పలు తప్పేలా లేవు.

### దళారులకే అమ్మేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర సర్కారు కొర్రీలు పెడుతున్న నేపథ్యంలో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 1330 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించి, ఇప్పటి వరకు దాదాపు అన్నింటినీ ప్రారంభించినట్టు అధికారులు చెబుతున్నారు. కానీ, ఒక్క కేంద్రంలోనూ ఇప్పటి వరకు క్వింటాల్ ధాన్యం కొన్నది లేదు. ఒక పక్క అకాల వర్షాలు ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో రైతులు కోతలకు తొందరపడుతున్నారు. తీరా తేమ పేరిట ఇప్పటి వరకు కేంద్రాల్లో ధాన్యం కొనడం లేదు. ఫలితంగా విసిగిపోతున్న అనేక మంది రైతులు ఇటు దళారులు, అటు మిల్లర్లకు అమ్మేసుకుంటున్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర మాత్రం ఇక్కడ వర్తించడం లేదు. కల్లాల వద్దకు వచ్చి కొంటున్న ధాన్యానికి క్వింటాల్‌కు ₹1,800 మాత్రమే చెల్లిస్తున్నారు. మిల్లుల వద్దకు వెళ్లి రైతులు విక్రయించుకుంటే ఒకో నూరు నూటాయాభై ఎక్కువ వస్తున్నాయి. దీంతో కేంద్రం ప్రకటించిన ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు ₹2,320, సాధారణ రకం క్వింటాల్‌కు ₹2,300 ఎక్కడా, ఏ రైతుకూ లభించడం లేదు. ఇప్పటికైనా నిబంధనలు సడలించి స్వేచ్ఛగా విక్రయించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# గంగులకు కేటీఆర్ పరామర్శ

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 24 : మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మకు మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. గురువారం రాత్రి 8.30 గంటల తర్వాత నగరంలోని గంగుల నివాసానికి చేరుకున్న ఆయన, మొదట లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఎమ్మెల్యే కమలాకర్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆ తర్వాత ఇంటి ఆవరణలో బీఆర్‌ఎస్ నాయకులతో కాసేపు ముచ్చటించారు. కేటీఆర్‌తోపాటు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, దావ వసంత, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్లు పొన్నం అనిల్, రవీందర్‌రెడ్డి నివాళులర్పించారు.

### సిరిసిల్లలో రాత్రి బస

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 24: కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగులను పరామర్శించిన అనంతరం కేటీఆర్, రాత్రి సిరిసిల్లకు చేరుకున్నారు. క్యాంపు కార్యాలయంలో బస చేశారు. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 10:15 గంటల వరకు అక్కడే అందుబాటులో ఉండనున్నారు. అనంతరం పద్మనాయక కల్యాణ మండపంలో విద్యుత్ చార్జీల పెంపుపై విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) నిర్వహించే బహిరంగ విచారణకు హాజరు కానున్నారు. ఈ విషయాన్ని బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి తెలిపారు.



ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, సంజయ్ కల్వకుంట్ల, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

# ఒకటిన బీసీ కమిషన్ బృందం రాక

జగిత్యాల, అక్టోబర్ 24 : రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం వచ్చే నెల ఒకటిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వస్తున్నట్లు జగిత్యాల కలెక్టర్ బీ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలోని సభ్యులు, బీసీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ జరుపనుందని వెల్లడించారు. తమ తమ అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా సమర్పించవచ్చని సూచించారు. నిర్దేశిత నమూనాలో తెలుగు లేదా ఆంగ్ల భాషలో (6) సెట్లలో ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలు, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను నివేదించవచ్చని తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

# ధాన్యం ఎప్పుడు కొంటరు?

- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, అక్టోబర్ 24 : కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో హడావుడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి చేతులు దులిపేసుకుంటున్నదని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ధ్వజమెత్తారు. గ్రామాల్లో 40 శాతం వరి కోతలు అయ్యాయని, కేంద్రాల్లో ధాన్యం పోసి 20 రోజులైందని, ఇప్పటి వరకు ఒక్క గింజను తూకం వేయలేదని మండిపడ్డారు. అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారని, ఇంకెప్పుడు కొంటారని ప్రశ్నించారు. ఇల్లంతకుంటలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నా.. కొనుగోళ్లపై శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు లేవని, ఏ గ్రామానికి చెందిన ధాన్యం ఏ మిల్లుకు వెళ్లాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. కేంద్రాల్లో తూకం వేయక పోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి అగ్గువకే అమ్ముతున్నారని, ఇప్పటికే దాదాపు 30 శాతం ధాన్యం విక్రయించి నష్టపోయారని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని సూచించారు. లేకుంటే రైతుల పక్షాన ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లెనర్సింహారెడ్డి, నాయకులు కేవీయన్ రెడ్డి, ఉడుతల వెంకన్న, సంతోష్ రెడ్డి, నాగరాజు, రఘు, మధు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ కండువా కప్పుకొన్నది ఎమ్మెల్యే సంజయ్ కాదా..?

ప్రశ్నించిన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత


జగిత్యాల, అక్టోబర్ 24 : బీఆర్‌ఎస్‌ను విడిచి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో అర్ధరాత్రి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నది ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాదా..? అని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ బీ ఫామ్ మీద గెలిచి వెళ్లినప్పుడే ఆ పార్టీ వ్యక్తి అయ్యారని విమర్శించారు. జగిత్యాలలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోక పోతే గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పెట్టిన సమావేశానికి ఎమ్మెల్యే ఎందుకు హాజరయ్యారో ప్రజలకు తెలుపాలన్నారు. రాజకీయ జన్మనిచ్చింది బీఆర్‌ఎస్, కవిత అని గతంలో చెప్పిన ఆయన, ఇప్పుడు కాంగ్రెస్ నేపథ్యం కలిగిన కుటుంబం అని సోయి లేకుండా మాట్లాడుతున్నాడని విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో పదవి పోతుందన్న భయంతో ఈ ఇలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జాబితాపూర్‌లో జరిగిన మారు గంగారెడ్డి హత్యను బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన పూర్తిగా ఖండిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, కౌన్సిలర్ దేవేందర్‌నాయక్, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ శీలం ప్రియాంక ప్రవీణ్, అర్బన్ మండలాధ్యక్షుడు తుమ్మ గంగాధర్, మాజీ జడ్పీటీసీ మహేశ్, అర్బన్ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ రావు, రూరల్ మండల సమన్వయ కమిటీ సభ్యులు పడిగెల గంగారెడ్డి, ఆనంద్ రావు, ఆసీఫ్, శ్రీనివాస్, గంగారాజం, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ముత్తు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

# పరిశ్రమలకు షాక్!

## విద్యుత్ చార్జీలు పెంపునకు రంగం సిద్ధం!



పరిశ్రమలకు షాక్ తగలబోతున్నది. నవంబర్ నుంచి పెద్ద ఎత్తున విద్యుత్ చార్జీలు పెంచేందుకు రాష్ట్ర సర్కారు కసరత్తు చేస్తున్నది. అందులో భాగంగా శుక్రవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణమండపంలో విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణ చేపట్టనున్నది. అసలే సబ్సిడీలు రాక, సర్కారు ప్రోత్సహంలేక మూతపడుతున్న పరిశ్రమలపై మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా పెరగనున్న విద్యుత్ బిల్లులు భారం కానున్నాయి. మరోవైపు చిన్న, పెద్ద పరిశ్రమలన్నింటికీ ఒకే టారిఫ్ అమలు చేయాలన్న నిర్ణయంపై నిరసన వ్యక్తమవుతున్నది.

- నవంబర్ నుంచి పెంచే అవకాశం
- ఇకపై అన్నింటికీ ఒకే కేటగిరి?
- పారిశ్రామికవేత్తల్లో ఆందోళన
- నేడు సిరిసిల్లలో విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ సభ

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : పరిశ్రమలకు సర్కారు ప్రోత్సాహం కరువైంది. మరోవైపు మాంద్యం నెలకొనడంతో రైస్, జిన్నింగ్ మిల్లుల పరిస్థితి దారుణంగా తయారైంది. వ్యవసాయం తర్వాత వేలాది మందికి ఉపాధి కల్పించే వస్త్ర పరిశ్రమ కుదేలైంది. దీంతో విద్యుత్ సబ్సిడీలు రాక బిల్లులు చెల్లించలేని స్థితిలో యజమానులు కొట్టుమిట్టాడుతుండగా, ఈ పరిస్థితుల్లోనే ప్రభుత్వం నవంబర్ నుంచి విద్యుత్తు చార్జీల ధరలు పెంచేందుకు సిద్ధమవుతున్నది. హెచ్‌టీ క్యాటగిరీలో విద్యుత్ చార్జీల పెంపు, ఎల్‌టీ క్యాటగిరీలో నెలకు 300 యూనిట్లకు పైగా వాడే వారికి ఫిక్స్‌డ్ చార్జీలను పెంచేందుకు అనుమతించాలని ఇప్పటికే ఈఆర్సీ ముందు డిస్కంలు ప్రతిపాదించగా, పారిశ్రామికుల్లో ఆందోళన వ్యక్తం అవుతున్నది. ఇప్పటికే పరిశ్రమలు నడవక, విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేక ₹లక్షల్లో బకాయిలు పేరుకు పోయాయి. సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థకు ఇప్పటికే ₹700 కోట్ల పైచిలుకు బకాయిలు ఉన్నాయి. దీంతో ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. అందులో ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలే ₹500 కోట్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.





సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ కార్యాలయం

### చిన్న, పెద్ద పరిశ్రమలన్నీ ఒకే గొడుగు కిందకు..

పరిశ్రమలను కేటగిరీల వారీగా గుర్తించి విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం నాలుగో కేటగిరీ కింద యూనిట్‌కు ₹7.65 నుంచి ₹8.50 వసూలు చేస్తుండగా, మూడో కేటగిరీ కింద యూనిట్‌కు ₹4 వసూలు చేస్తున్నారు. చిన్న, మధ్యతరహా, పెద్ద పరిశ్రమలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చి టారిఫ్ రేట్లు కూడా ఒకేలా ఉండేలా నిర్ణయించే ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. ఈ నిర్ణయం సరైంది కాదంటూ పారిశ్రామికవేత్తలు అభ్యంతరం చెబుతున్నారు. అసలే పరిశ్రమలు నడవక అప్పుల పాలవుతుంటే, సర్కారు విద్యుత్ బిల్లుల భారం మోపి మరింత కుదేలయ్యేలా చేస్తున్నదని మండిపడుతున్నారు.

### 'పవర్‌లూం'ను మూడో కేటగిరీలో చేర్చాలి

సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమను నాలుగో కేటగిరీ నుంచి మూడో కేటగిరీకి మార్చాలన్న డిమాండ్ వస్తున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం పరిశ్రమను ఆదుకోవాలన్న ఉద్దేశంతో మూడో కేటగిరీలోకి మార్చి యూనిట్ విద్యుత్‌కు ₹4 చొప్పున, అందులో ₹2 సబ్సిడీతో చేయూతనిచ్చింది. యూనిట్ విద్యుత్‌కు ₹2 మాత్రమే యజమానులు చెల్లించారు. పవర్‌లూం వస్త్ర పరిశ్రమకు ఇతర రాష్ట్రాల్లోనూ అక్కడి ప్రభుత్వాలు యూనిట్‌కు ₹2లే వసూలు చేస్తూ అండగా నిలుస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సిరిసిల్ల మరమగ్గాలను నాలుగో కేటగిరీలోకి మార్చి యూనిట్ విద్యుత్‌కు ₹7.65 వసూలు చేస్తున్నది. ఇది తమకు భారమవుతున్నదని ఆసాములు, యజమానులు బకాయిలు కూడా చెల్లించలేదు. మరోవైపు ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ ఇవ్వక పోవడంతో సెస్‌పై భారం పడుతున్నది. మరమగ్గాల పరిశ్రమకు వినియోగించే విద్యుత్‌ను మూడో కేటగిరీలోకి చేర్చాలని ఆసాములు, యజమానులు డిమాండ్ చేస్తున్నారు. అది కూడా 10 హెచ్‌పీల నుంచి 30 హెచ్‌పీలకు పెంచాలని కోరుతున్నారు.

### వ్యవసాయానికి 5 హెచ్‌పీలకే సబ్సిడీ

వ్యవసాయ, మరమగ్గాలకు వినియోగించే విద్యుత్ సబ్సిడీతో సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థపై అదనపు భారం పడుతున్నది. వ్యవసాయ రంగానికి 5 హెచ్‌పీల వరకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తున్నది. రైతులు 7.50 హెచ్‌పీల వరకు మోటర్లు వినియోగిస్తున్నారు. ప్రభుత్వం 5 హెచ్‌పీల వరకు మాత్రమే ఉచిత విద్యుత్ ఇస్తుండగా, సెస్‌పై రెండున్నర హెచ్‌పీల విద్యుత్ బిల్లులు భారమవుతున్నాయి. అలాగే, 10 హెచ్‌పీల వరకు మరమగ్గాలకు విద్యుత్ రాయితీ ఇస్తుండగా, 20 హెచ్‌పీల వరకు నడిపిస్తున్నారు. వీటి వల్ల సెస్‌కు నష్టం వాటిల్లుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.

### నేడు విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణ

విద్యుత్ సమస్యలు, చార్జీల పెంపుపై ప్రజల నుంచి విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) వివరాలు సేకరిస్తున్నది. అందులో భాగంగా శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో బహిరంగ విచారణ నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఈఆర్‌సీ చైర్మన్ రంగారావు హాజరుకానున్నారు. విద్యుత్ సమస్యలపై జిల్లా నుంచి పెద్ద ఎత్తున రైతులు, పారిశ్రామిక వేత్తలు, గృహ వినియోగదారులు పాల్గొని విద్యుత్ చార్జీల పెంపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వినతి పత్రాలు సమర్పించనున్నారు.

### సమస్యలను నివేదిస్తాం



సెస్ పరిధిలో అనేక సమస్యలున్నాయి. వాటన్నింటినీ పాలకవర్గం ఆధ్వర్యంలో విద్యుత్ నియంత్రణ మండలికి సమర్పిస్తాం. ముఖ్యంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని మరమగ్గాలకు కల్పిస్తున్న విద్యుత్ రాయితీలను 10 హెచ్‌పీ నుంచి 30హెచ్‌పీలకు పెంచాలన్నది డిమాండ్. అలాగే, వ్యవసాయ రంగానికి ఉచితంగా విద్యుత్ 5 హెచ్‌పీల వరకు మాత్రమే ప్రభుత్వం ఇస్తున్నది. రైతులు 7.50 హెచ్‌పీల వరకు మోటర్లు వాడుతున్నారు. దీంతో సెస్‌కు నష్టం వస్తున్నందున 7.50 హెచ్‌పీలకు పెంచాలని కోరుతున్నాం. పాలకవర్గం రెండేళ్లలోనే ₹11 కోట్లున్న విద్యుత్ డిమాండ్‌ను ₹22 కోట్లకు తీసుకువచ్చాం. భవిష్యత్తులో ₹30 కోట్ల నుంచి ₹40 కోట్లకు పెంచే ఆలోచనతో ముందుకు పోతున్నాం. పెర్ఫార్మెన్స్ బాగా ఉన్నందున పై డిమాండ్లను ముందు పెట్టి సాధించుకునేందుకు ప్రయత్నం చేస్తాం.

- చిక్కాల రామారావు, సెస్ చైర్మన్